సాక్షి విశాఖపట్నం

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023




ఎస్‌ఐ అభ్యర్థులకు పరీక్షలు

ఎస్‌ఐ ఉద్యోగాల భర్తీలో భాగంగా విశాఖ రేంజ్ పరిధిలో మహిళా అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. IIలో



ముత్యాల వస్త్రాలంకరణలో..

కురుపాం మార్కెట్ సమీప కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ముత్యాల వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. IIలో



పలు రైళ్ల రీ షెడ్యూల్

లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున.. కొన్ని రైళ్లు రీ షెడ్యూల్, మరికొన్ని రైళ్ల గమ్యం కుదించారు. IIలో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ పూజ నేడు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కోరారు. మధురవాడలోని పనోరమ హిల్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురవాడలోని నూతన కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేతకు ఘన నివాళులర్పించి.. వివిధ సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస రావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, జోనల్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు.

ఆగస్టులో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రికార్డులు



ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో అనేక రికార్డులను నెలకొల్పుతోంది. ఈ ఆగస్టులో స్పెషల్ బార్ మిల్ 65,001 టన్నులు ఉత్పత్తి చేసింది. విస్తరణ యూనిట్ల అన్నింటి నుంచి 1,81,886 టన్నులు ఉత్పత్తి చేయడం ద్వారా ప్లాంట్ ప్రారంభం నుంచి ఏ నెలలోను సాధించని విధంగా అధిక ఉత్పత్తి నమోదైంది. హై ఎండ్ వాల్యూ యాడెడ్ స్టీల్ ఉత్పత్తిలో ప్లాంట్ ప్రారంభం నుంచి ఏ ఆగస్టు నెలలో సాధించని విధంగా ఈ ఆగస్టులో అత్యుత్తమంగా 1,57,610 టన్నులు సాధించింది. ఈ ఆగస్టులో రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు కలిపి 4,16,900 టన్నులు, బ్లాస్ట్‌ఫర్నేస్–2లో 2,13,000 టన్నులు ఉత్పత్తి చేయడం ద్వారా ప్లాంట్ ప్రారంభం నుంచి ఏ ఆగస్టులో సాధించని విధంగా అత్యుత్తమ పనితీరు ప్రదర్శించింది. వైర్ రాడ్ మిల్ 57,700 టన్నులు, స్ట్రక్చరల్ మిల్ 60,308 టన్నులు, సింటర్ మిషన్లు మూడింటి నుంచి 6,17,787 టన్నులు ఉత్పత్తి చేయడం ద్వారా ప్లాంట్ ప్రారంభం నుంచి ఏ ఆగస్టు నెలలో సాధించని విధంగా ఈ ఆగస్టులో అధిక ఉత్పత్తి రికార్డు నమోదైంది. ఆగస్టు నెలలో అమోఘమైన ఉత్పత్తిని సాధించినందుకు ఉద్యోగులను సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ ఎ.కె.బాగ్చీలు అభినందించారు.

పాలిసెట్ వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరు

మురళీనగర్: పాలిసెట్ రెండో విడత కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మాత్రమే హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం నుంచే వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కాగా.. శనివారం సాయంత్రంతో ముగుస్తుంది. ఈ నెల 4న సీట్లు కేటాయిస్తారు. అదే రోజు నుంచి 7వ తేదీ వరకు సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ పత్రంతో పాటు సీటు కేటాయింపు పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. కాగా.. ఈసెట్ కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో విద్యార్థులకు గురువారం సీట్లు కేటాయించారు. వీరు ఈ నెల 4లోగా వారికి కేటాయించిన ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

మహారాణిపేట : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేష సాయి శనివారం విశాఖ వస్తున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం 5.35 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. అక్కడ నుంచి మద్దిలపాలెంలో కాకతీయ కన్వెషన్ సెంటర్‌లోను, బోయిపాలెం చిలుకూరి పేరల్ ప్యాలెస్ రీసార్ట్‌లో వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. ఆదివారం సాయంత్రం 5.25 గంటలకు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి విజయవాడ వెళతారు.

జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయం మార్పు

మహారాణిపేట: లాసెన్స్ బే కాలనీలో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయం చిరునామా మారింది. ఎంవీపీకాలనీలో ఉన్న ఉషోదయ జంక్షన్ క్వీన్స్ స్కూలు పక్క భవనంలో (కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి) కార్యాలయాన్ని శుక్రవారం ఏర్పాటు చేసినట్టు అధికారి జి.సత్యానందం తెలిపారు.



మహానేత జ్ఞాపకాల్లో.. మన విశాఖి

- వైఎస్సార్ హయాంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు మహర్దశ
- ఆయన మరణంతో కుంటుపడిన అభివృద్ధి
- ప్రస్తుతం సీఎం జగన్ నాయకత్వంలో పరుగులు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నేడు

వైఎస్సార్.. ఆ పేరు ఓ ప్రభంజనం. నవ్వులో స్వచ్ఛత.. పిలుపులో ఆత్మీయత.. మాట తప్పని, మడమ తిప్పని గుణంతో ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రపంచీకరణ విధానాల యుగంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో మేళవించి చూపిన మహోన్నత నాయకుడు వైఎస్సార్. మహానేతను కోల్పోయి 14 ఏళ్లు గడిచిపోయాయి. కానీ ఆ జ్ఞాపకాలు చెరిగిపోలేదు..ఆ రూపం చెదిరిపోలేదు. మహానేత వైఎస్సార్ మానస పుత్రికగా విశాఖ నగరం.. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉజ్వలంగా వెలుగొందుతోంది. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా విశాఖలో మహానేత చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమాన్ని గుర్తు చేసుకుందాం.. – సాక్షి, విశాఖపట్నం

2004.. ఉమ్మడి విశాఖ జిల్లా అన్ని రంగాల్లో సంక్షోభ వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోంది. నగరంలో తాగునీటి సమస్య, అచ్యుతాపురం సెజ్ ఏర్పాటుకు భూసేకరణ, పరవాడ ఫార్మా సిటీ భూ వివాదాలు, గంగవరం పోర్టు భూ సేకరణ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. స్టీల్ ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డులు నష్టాల ఊబిలో కూరుకుపోయి మూసివేసే పరిస్థితి ఏర్పడింది. వీటి పరిష్కారమే లక్ష్యంగా 2005 జనవరిలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విశాఖలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో అత్యవసర ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఒక్కో సమస్యకు సానుకూల పరిష్కారం చూపించారు. నగరంలో మంచి నీటి సమస్య పరిష్కారంతో పాటు అచ్యుతాపురం, ఫార్మా సెజ్‌లకు భూముల ధర నిర్ణయించడంతో పాటు పునరావాస ప్యాకేజీలు ప్రకటించారు. నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించి రెండో దశను విస్తరించాలని నిర్ణయించారు. భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్(బీహెచ్‌పీవీ)ని భెల్(బీహెచ్‌ఈఎల్)లో విలీనం చేశారు. షిప్‌యార్డును రక్షణ శాఖలో విలీనం చేసి పునరుజ్జీవం కల్పించారు. అదే సమావేశంలో విశాఖలో ఐటీకి అభివృద్ధి బాటలు వేశారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజా నాయకుడిగా మన్ననలు అందుకున్నారు. ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, ఆరోగ్యశ్రీ, గృహనిర్మాణం, జలయజ్ఞం.. ఇలా ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేశారు.

మరుపురాని మహానేత గురుతులివీ..

- వైఎస్సార్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను 2005 నవంబర్ 22న మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ)గా మార్పు చేస్తూ.. గ్రేటర్ హోదా కల్పించారు. అప్పటి వరకు 111 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉన్న విశాఖ 540 చ.కి.మీ విస్తీర్ణంతో మహా విశాఖగా అవతరించింది. 2013లో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలు విలీనమయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో 10 పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసి.. 98 వార్డులుగా విస్తరించారు.
- జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం(జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం)లో విశాఖ నగరాన్ని చేర్పించడంలో వైఎస్సార్ కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో నగరానికి రూ.1,885 కోట్ల విలువైన పనులు దక్కాయి. సింహాచలం, పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, విలీన గ్రామాలకు తాగునీటి సౌకర్యం, భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన 20 ప్రాజెక్టులను వైఎస్సార్ తీసుకొచ్చారు.
- విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చింది వైఎస్సారే. దాంతో విమాన సర్వీసులు గణనీయంగా పెరిగాయి. విదేశాలకు కూడా ఇక్కడ నుంచి విమానాలు ఎగిరాయి. ఆ ఒరవడి కొనసాగిస్తూ ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.
- గోదావరి నీటిని విశాఖతో పాటు ఉత్తరాంధ్రలో తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చాలన్న సంకల్పంతోనే పోలవరం ఎడమ కాలువను నిర్మించారు. తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం ప్రాజెక్టుల ఆధునీకీకరణకు శ్రీకారం చుట్టారు. ఏలేరు నీటిని మళ్లించడం ద్వారా స్టీల్‌ప్లాంట్ నీటి సమస్యను పరిష్కరించారు.
- నగరంలోని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో రాజీవ్ గృహకల్ప ఇళ్లకు శ్రీకారం చుట్టారు. నగర పరిధిలో సుమారు లక్షకుపైగా పునరావాస, పూర్‌సెటిల్‌మెంట్ కాలనీ ఇళ్లు నిర్మించారు. రాజీవ్ గృహకల్ప ద్వారా రూ.650 కోట్లతో 15,320 ఇళ్లు, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ద్వారా రూ.600 కోట్లతో 15 వేల గృహాలు, వాంబే కింద రూ.400 కోట్లతో 9 వేల ఇళ్ల నిర్మాణం చేశారు. మధురవాడలో గృహ సముదాయాలు ఆయన చేతుల మీదుగానే ప్రారంభమయ్యాయి.
- ఐటీ ప్రగతి ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వికేంద్రీకరణ జరగాలని వైఎస్ భావించారు. విశాఖలో 3 కొండలు, కొండల కింద ఉన్న సుమారు 100 ఎకరాల పల్లపు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కనీసం 100 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఐటీ కంపెనీలకు మాత్రమే అవకాశమిచ్చి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్లాట్లుగా డివైడ్ చేసి అందించారు. వైఎస్ ఆలోచనలను మెచ్చి సుమారు 200 కంపెనీలు ముందుకొచ్చాయి.కొద్ది కాలంలోనే 70 శాతం కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయి. సత్యం, విప్రో కంపెనీలూ విశాఖలో తమ శాఖలను విస్తరింపజేశాయి. అలా.. వైజాగ్‌ను ఐటీ హబ్‌గా మార్చేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. వైఎస్సార్ మరణం తర్వాత.. దాదాపు పదేళ్లు విశాఖ ప్ర'గతి'తప్పింది. మళ్లీ 2019 తర్వాత ఐటీ ప్రగతి మళ్లీ పట్టాలెక్కింది. కొత్తగా ఇన్ఫోసిస్ తమ కార్యకలాపాలు ప్రారంభించింది. అదానీ డేటా సెంటర్‌కు ఇటీవలే సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

ఉత్తరాంధ్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించేందుకు 2006లో విమ్స్‌కు వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. 1130 పడకలు, 21 సూపర్ స్పెషాలిటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి 2007లో శంకుస్థాపన చేశారు. ఆయన మరణాంతరం అనేక పరిణామాల తర్వాత 2016 ఏప్రిల్‌లో విమ్స్ అందుబాటులోకి వచ్చింది. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో చంద్రబాబు ప్రభుత్వం.. విమ్స్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కుయుక్తులు పన్నింది. అప్పుడే ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్ సీపీ ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంది. కోవిడ్ సమయంలో విమ్స్ స్టేట్ కోవిడ్ హాస్పిటల్‌గా విశేష సేవలందించింది.





బీఆర్‌టీఎస్ రోడ్డు

కౌలు రైతులకు ఆర్థిక భరోసా



కౌలు రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ మల్లికార్జున

జిల్లాలో 28 మందికి రూ.2.10 లక్షల లబ్ధి

మహారాణిపేట: జిల్లాలో వరసగా ఐదో ఏడాది 'కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం' మొదటి విడత నిధులు విడుదలయినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్, జేసీ కె.ఎస్.విశ్వనాథన్ ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాలో 28 మంది కౌలు రైతు కుటుంబాలకు రూ.2.10 లక్షలు విడుదలయినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ నమూనా చెక్కును కౌలు రైతులకు అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, రైతులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అండగా ఉంటోంది. రైతు భరోసా పథకం కింద వచ్చిన సొమ్మును పెట్టుబడిగా ఉపయోగిస్తాను. గతంలో ధాన్యం కొనుగోలులో ఎన్నో అవకతవకలు జరిగాయి. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా అవినీతి లేకుండా కొనుగోలు చేస్తున్నారు. కౌలు రైతులకు మేలు చేసిన సీఎం జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం.

– కోరాడ అప్పల నారాయణ, కౌలు రైతు, పాంద్రంగి, పద్మనాభం మండలం

పంటకు పెట్టుబడి సాయం



వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద వచ్చిన సొమ్ము పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. రైతుల వద్ద కొంత భూమిని తీసుకొని కౌలు చేస్తున్నాను. నాలాంటి కౌలు రైతులకు ఈ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కౌలు రైతులను ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– మహంతి రమణ, కౌలు రైతు, గొట్టిపల్లి, ఆనందపురం మండలం

తొలిరోజు 75.56 శాతం పింఛన్ల పంపిణీ



39వ వార్డు పాతనగరంలో అప్పయ్యమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాధిక



37వ వార్డు జాలారిపేటలో కర్రి ఆదిలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న కార్యదర్శి లావణ్య



పెయింన్‌దొర పేటలో అప్పలనరసమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చిన్ని

మహారాణిపేట: వైఎస్సార్ పింఛన్ కానుక శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జిల్లాలో 75.56 శాతం పంపిణీ పూర్తయింది. కొత్తగా మంజూరైన 3,952 పింఛన్లతో కలిపి జిల్లాలో 1,60,981 మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం రూ.45.25 కోట్లను విడుదల చేసింది.

గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో వలంటీర్లు శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభించారు. తుది సమాచారం ప్రకారం జిల్లాలో 98,658 మందికి(75.56 శాతం) పింఛన్ సొమ్ము అందించారు. లబ్ధిదారులందరికీ ఈ నెల 5లోగా పింఛన్ అందజేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభారాణి తెలిపారు.

పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



డాబాగార్డెన్స్: పర్యావరణహితంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుందామని నగర ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నివాస సంక్షేమ సంఘ సభ్యులు, ఎన్జీవో, ఉత్సవాల కమిటీ ప్రతినిధులతో శుక్రవారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే వినాయక ప్రతిమలు వాడకుండా చూడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, సింథటిక్ రసాయనాలు వాడిన విగ్రహాలను ఉపయోగించడం వల్ల కలిగే హానికర ప్రభావాలు ప్రజల ఆరోగ్యంపై పడతాయన్నారు. విత్తనాలతో కలిపి చేసిన వినాయక ప్రతిమలు ఉపయోగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి జీవీఎంసీకి సహకరించాలన్నారు. గణేష్ మండపాలు సంప్రదాయబద్ధంగా ఉండాలని, ప్లాస్టిక్ ఉపయోగించకుండా, రోడ్లను తవ్వి మండపాలు నిర్మించకుండా ఉత్సవ కమిటీలు శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసి రావు, ప్రజారోగ్యపు అధికారులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

విశాఖ స్పోర్ట్స్: ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఎంవీపీలోని స్పోర్ట్స్ ఎరీనాలో ప్రారంభమైంది. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన బాల బాలికల జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. సింగిల్స్, డబుల్స్ పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సంఘ కార్యదర్శి పి.శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి ఉషశ్రీ పాల్గొన్నారు.

రైల్వే భద్రతలో ట్రాక్ మెయింటనర్స్‌దే కీలక పాత్ర

తాటిచెట్లపాలెం : రైల్వే భద్రత, రైళ్ల సురక్షిత రవాణాలో ట్రాక్ మెయింటనర్స్‌దే కీలక పాత్ర అని వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అన్నారు. డివిజనల్ పర్మినెంట్ వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాక్ మెయింటనర్స్‌కు నిర్వహించిన ఇండక్షన్ ట్రైనింగ్ ముగిసిన సందర్భంగా శుక్రవారం శ్రీనివాస కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని డీఆర్‌ఎం సత్కరించారు. ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో, క్షేత్రస్థాయిలో వీరి అనుభవాలను డీఆర్‌ఎంతో పంచుకున్నారు. అనంతరం సీనియర్ అధికారులు రైల్వే ట్రాక్స్ పరిరక్షణ విషయంలో తీసుకోవాల్సిన భద్రత, భద్రతా పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కాగా.. రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ ద్వారా ఎంపికైన 145 మంది ట్రాక్ మెయింటనర్స్ డాల్ఫిన్ నోస్ కాలనీలోని శిక్షణ కేంద్రంలో కొద్ది రోజులుగా శిక్షణ పొందారు. సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో ఆర్డినేషన్) ఎ.కె. మహరాణా, ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న ట్రాక్ మెయింటనర్స్‌తో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

- 3వ తేదీ ఉదయం 9 నుంచి 12.30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

వేదిక:
డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్, రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

క్షతగాత్రులను ఆదుకున్న అమర్‌నాథ్



క్షతగాత్రుడు నాగేశ్వరరావును అంబులెన్స్‌లో ఎక్కించేందుకు తీసుకువస్తున్న మంత్రి సిబ్బంది

అనకాపల్లి టౌన్/పరవాడ: జాతీయ రహదారిపై సాలాపువానిపాలెంలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో సహాయం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు క్షతగాత్రులను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదుకున్నారు. వారిని హుటాహుటిన లంకెలపాలెం సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బుచ్చెయ్యపేట మండలం రాజాంనకు చెందిన పినపోలు నాగేశ్వరరావు, అతని తమ్ముని కుమారుడు సంజయ్ ద్విచక్ర వాహనంపై విశాఖ వైపు వెళుతుండగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాహనం అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నాగేశ్వరరావుకు తలతో సహా పలు చోట్ల గాయాలై రక్తస్రావమైంది. పదేళ్ల సంజయ్ కూడా తీవ్ర రక్తస్రావంతో రోడ్డు మీదపడి ఉన్నాడు. ఇదే సమయంలో మంత్రి అమర్‌నాథ్ అనకాపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముగించుకుని విశాఖకు వెళుతున్నారు. రోడ్డు పక్కన రక్తమోడుతూ కనిపించిన వీరిద్దరినీ చూసి, వాహనం దిగి వెంటనే తన కాన్వాయ్‌లో ఉన్న వాహనంలో ఎక్కించి అనకాపల్లి రూరల్ పోలీసుల సహకారంతో సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స జరుగుతున్న సమయంలోనే రెండు అంబులెన్సును ఆస్పత్రికి పంపించి క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : ఆయా స్టేషన్ల పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన, ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుందున రీ షెడ్యూల్ చేసినట్లు, మరికొన్ని గమ్యం కుదించినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు : శుక్రవారం ఎస్ఎంవీ బెంగళూరులో ఉదయం 10.15గంటలకు బయల్దేరవలసిన ఎస్ఎంవీ బెంగళూరు -అగర్తలా (12503) హమ్‌సఫర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరింది. సంత్రగచ్చిలో శుక్రవారం సాయంత్రం 6గంటలకు బయల్దేరవలసిన సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22807) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11గంటలకు బయల్దేరింది.

తిరుమల ఎక్స్‌ప్రెస్ తిరుపతి వరకే.. : గుంతకల్ డివిజన్ ముద్దనూరు-మంగపట్నం పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల నిమిత్తం తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో తిరుపతి వరకే రాకపోకలు సాగిస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 4,5,9 తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ-కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ తిరుపతి వరకే నడుస్తుంది. ఈ నెల 5,6,10 తేదీల్లో కడపలో బయల్దేరవలసిన కడప-విశాఖ (17487) తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప నుంచి కాకుండా తిరుపతి నుంచి బయల్దేరుతుంది.

43 మంది మందుబాబులకు సేవా శిక్ష



భీమిలి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మందుబాబులు

ఆనందపురం: ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 43 మందికి శుక్రవారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ న్యాయస్థానం మెజిస్ట్రేట్ జి.వి జయలక్ష్మి రూ.1000 వంతున జరిమానా విధించారు. కమ్యూనిటీ సర్వీస్ శిక్షలో భాగంగా భీమిలి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ఆవరణను శుభ్రం చేయాలని తీర్పునిచ్చారు. శిక్ష పడిన వారితో ఆయా కార్యాలయాల ఆవరణను పోలీసులు శుభ్రం చేయించారు. పిచ్చి మొక్కలు తొలగింపజేశారు.

ఏయూలో అమెరికా కార్నర్ పనితీరు భేష్

అమెరికా కాన్సులేట్ బృందం పర్యటన



శ్రీనివాసన్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికా కాన్సులేట్ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. హైదరాబాదులోని అమెరికా కాన్సులేట్ ప్రిన్సిపల్ కమర్షియల్ ఆఫీసర్ రాఘవన్ శ్రీనివాసన్‌తో కూడిన ముగ్గురు సభ్యుల బృందం ఏయూకు విచ్చేశారు. ముందుగా ఏయూలోని అమెరికా కార్నర్‌ను సందర్శించారు. ఇక్కడ కేంద్రం పనితీరు, చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతిని అమెరికా కార్నర్ మెంటార్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ వివరించారు. రెండేళ్ల కాలంలో మొత్తం 80 కార్యక్రమాలు నిర్వహించామని, వీటిలో చాట్‌విత్ డిప్లమాట్, ప్యానల్ డిస్కషన్, బుక్ రీడింగ్ సెషన్, విభిన్న అంశాలపై చర్చా కార్యక్రమాలను నిర్వహించినట్లు వివరించారు. ఏయూలోని అమెరికా కార్నర్ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రగతిని ప్రశంసించారు. అనంతరం అంబేడ్కర్ చైర్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యక్రమాలను తెలుసుకున్నారు. అనంతరం ఏయూ ఫార్మసీ కళాశాల, రసాయన శాస్త్ర విభాగం, ఏయూ ఫార్మాఇంక్యుబేషన్‌సెంటర్ ఎలిమెంట్‌లను సందర్శించారు. తన తాత ఎస్.రంగస్వామి ఏయూ ఫార్మసీ కళాశాలకు వ్యవస్థాపకుడిగా, తొలి విభాగాధిపతిగా సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాలలో రాఘవన్‌శ్రీనివాసన్‌ను సత్కరించారు.

కార్యక్రమంలో భాగంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ అభివృద్ధిని వీసీ ప్రసాద రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ధనుంజయ రావు, రీసెర్చ్ డీన్ ఆచార్య కె.బసవయ్య, ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య ఈశ్వర కుమార్, ఆచార్య రాంజీ, యూఎస్ కాన్సులేట్ కమర్షియల్ అడ్వైజర్ సునీల్ కుమార్, పొలిటికల్ అండ్ ఎకనామిక్ స్పెషలిస్ట్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ తరపున

ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి



ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీప కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం పూజలు ఘనంగా జరిపారు. అమ్మవారు ముత్యాల వస్త్రాలంకరణలో కనువిందు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు వేకువజాము 5 గంటలకు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ వంటి 108 ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా నివేదించి అమ్మవారిని ముత్యాల వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. 350 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, పురోహితుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ, కన్యకాపరమేశ్వరి దేవస్థానం శ్రావణ మాస ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ వేదా కవిత, కొత్తా సాహిత్య, ప్రసన్న, సత్యవతి పాల్గొన్నారు.

97 మంది మహిళా ఎస్ఐ అభ్యర్థుల గైర్హాజరు



1600 మీటర్ల పరుగులో పోటీపడుతున్న అభ్యర్థులు

అరిలోవ: ఎస్ఐ ఉద్యోగాల భర్తీలో భాగంగా విశాఖ రేంజ్ పరిధిలో మూడు రోజులుగా మహిళా అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం 685 మంది అభ్యర్థులకు 97 మంది గైర్హాజరయ్యారు. మిగతా 588 మందికి అధికారులు ఇక్కడ పోటీలు నిర్వహించారు. విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి.. ఎత్తు, బరువు పరీక్షలు చేశారు. అనంతరం 1600, 100 మీటర్ల పరుగు పందెం పోటీలు, లాంగ్ జంప్ నిర్వహించారు. మహిళలకు ఈ పరీక్షలు శనివారంతో ముగియనున్నాయి. సోమవారం నుంచి మళ్లీ పురుష అభ్యర్థులకు పరీక్షలు కొనసాగనున్నాయి. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు అధికారులు విధులు నిర్వహించారు.

సకాలంలో జగనన్న కాలనీలు

పరవాడ: జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఉత్తరాంధ్ర జిల్లాల గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బీఎం దివాన్ మైదిన్ ఆదేశించారు. వెన్నలపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని ఆయన శుక్రవారం సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను సెప్టెంబర్‌లో ప్రారంభించనున్న దృష్ట్యా కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి లబ్ధిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వెన్నలపాలెంలో జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన 289 ఇళ్లకు 172 ఇళ్లను లబ్ధిదారులు పూర్తి చేశారని, మిగిలిన ఇళ్లను కూడా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. వెన్నలపాలెం జగనన్న కాలనీలో రోడ్లు, కాలువలు, ఆర్చీల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.31 లక్షలను విడుదల చేసిందని చెప్పారు. మంజూరైన నిధులతో నిర్మాణం పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, గృహ నిర్మాణ శాఖ డీఈ రాజు, ఏఈ ఎం.ఎస్.ఎస్.ఎన్ రెడ్డి, పీఆర్ ఏఈ జి.రామారావు, ఏపీడీసీఎల్ ఏఈ శేషసాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, పార్టీ నాయకులు పైలా రేగారావు, ఎం.ముత్యాలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

రాఖీ కట్టించుకుని తిరుగు ప్రయాణంలో..

● ట్రాలర్ లారీ ఢీకొని యువకుడి మృతి



ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై ట్రాలర్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన గోవిందరావు (ఇన్‌సెట్) గోవింద్ (ఫైల్)

గోపాలపట్నం : రక్షాబంధన్ మా బంధాన్ని తెంచే స్తుందని ఊహించ లేదు. రాఖీ కట్టేందు కు రాకపోయి ఉంటే నా అన్న బతికేవాడు అని ఆ చెల్లెలు ఆవేదన అందర్నీ కలచివేసింది. గురువారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఎన్ఏడీ ఫ్లై వోవర్‌పై ట్రాలర్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన కొంచాడ గోవిందరావు (27) (అలియాస్ గోపి) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అగనంపూడిలో నివాసముంటున్న చెల్లి పద్మ ఇంటికి సాయంత్రం ద్విచక్రవాహనంపై గోవిందరావు వెళ్లాడు. రాఖీ కట్టి, చెల్లిని ఆశీర్వదించి తిరుగుపయనమయ్యాడు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్ నుంచి ఐరన్ లోడుతో వెళుతున్న ట్రాలర్ లారీ మురళీ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. వెనుక చక్రాల కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.

రెండు నెలల క్రితమే విశాఖకు.. : నిమ్మాడ నుంచి రెండు నెలల క్రితమే మురళీ విశాఖ వచ్చాడు. నగరంలో ఓ ప్రయివేటు ట్రావెల్స్‌లో కారు డ్రైవర్‌గా చేరాడు. మురళీనగర్‌లో తన స్నేహితుడు ఇంట్లో ఉంటున్నాడు. మృతునికి తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

● స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
● భర్త మృతి, భార్యకు గాయాలు



ప్రమాదం నుంచి బయటపడిన మృతుని భార్య పద్మ, రోదిస్తున్న బంధువులు



మృతి చెందిన శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: అగనంపూడిలో శుభకార్యానికి వెళ్తున్న భార్యాభర్తల స్కూటీని బస్సు ఢీ కొనడంతో భర్త అక్కడికక్కడే దుర్మరణం చెందగా భార్య స్వల్పగాయాలతో బయటపడింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయన గరం జిల్లా గంట్యాడ మండలం, నరవ గ్రామానికి చెందిన మానాపురం శ్రీనివాసరావు (57) తన భార్య పద్మతో కలిసి అగనంపూడిలోని ఫ్యామిలీ ఫ్రెండ్ ఇంట్లో శుభకార్యానికి శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై బయలు దేరారు. షీలానగర్ నుంచి గాజువాక వైపు వెళ్తున్న క్రమంలో నాతయ్యపాలెం పంప్ హౌస్ ఎదురుగా అనకాపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి వాహనాన్ని ఢీకొంది. శ్రీనివాసరావు తూలి పడిపోగా అతని తలపై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న పద్మ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడింది. సంఘటన స్థలానికి చేరుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ కొల్లి సతీష్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీనివాసరావుప్రైవేట్ పనులు చేస్తుంటాడని బంధువులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరారయ్యాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు బాలాజీ

పీఎంపాలెం: కొమ్మాది కార్పెంటర్ కాలనీలో నివసిస్తున్న గుల్లిపల్లి బాలాజీ (28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం బాలాజీ స్వయంకృషి నగర్‌లో డ్రైవింగ్ స్కూల్ ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం డ్రైవింగ్ స్కూల్ వద్ద పడుకోడానికి వెళుతున్నానని తన తండ్రి తిరుపతిరావుకు చెప్పాడు. శుక్రవారం ఇంటికి రాకపోవడం, ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.